క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



ముస్లింలకు అందించేందుకు సరకులతో కలిగొట్ల శ్రీరామ్

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పేద ముస్లింలకు నిత్యావసర సరకులు బుధవారం అందించారు. రంజాన్ పండగ సందర్భంగా 20 పేద కుటుంబాలకు నెలకు సరిపడా 11రకాలైన సరకులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పండగ ముస్లింలకు ఎంతో పవిత్రమైనదన్నారు. ఈ పండగ జరుపుకునేందుకు ఫౌండేషన్ తరఫున సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్ అన్వర్, తాజుద్దీన్, అంజు, బాషా, యాసిన్, షేక్ సుభాని పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కొమ్మాది ఏఈగా సురేష్

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది సబ్ స్టేషన్ ఏఈగా వై.సురేష్ కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. విజయనగరం అర్బన్ అయ్యన్నపేట నుంచి ఇక్కడికి బదిలీపై ఆయన వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన సంతోష్ కుమార్ అక్కడకు బదిలీపై వెళ్లారు. వీరిరువురు మ్యూచివల్ ట్రాన్స్‌ఫర్‌పై బదిలీ అయ్యారు. కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలోని సమస్యలపై సురేష్ కుమార్‌ను 94937 83635లో సంప్రదించవచ్చు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట శ్రీ ఎర్నిమాంబ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం కోసం స్థానికులు గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో అవసరమైన ప్రతీ చోట డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఓటీఎస్ పట్టాలు అందజేత



పట్టాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో కార్పొరేటర్ లొడగల అప్పారావు 72 మంది లబ్దిదారులకు ఓటీఎస్ పట్టాలు బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో అల్లాడ ఉమా మహేశ్వరరావు, మాదు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది కే1 కాలనీలో కొంత కాలంగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు పరిష్కారం దొరికింది. ఇక్కడి పైప్‌లైన్లు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో స్థానికులకు మంచి నీటి సమస్య ఏర్పడింది. దీంతో కాలనీ అధ్యక్షులు అవతార్ సింగ్, జకాష్, ఆల్తాఫ్ తదితరులు సమస్యను కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆమె ఆదేశాల మేరకు పైప్‌లైన్‌కు సిబ్బంది మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు. దీంతో స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

గంభీరంలో గెడ్డల దురాక్రమణ

- పూడ్చివేసి ఇళ్ల స్థలాలుగా మార్పు
- అనంతరం లక్షలాది రూపాయలకు విక్రయం



గెడ్డ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇల్లు



గంభీరంలో గెడ్డను పూడ్చివేసి చదును చేసిన దృశ్యం



గెడ్డ ప్రాంతంలో నిర్మించిన ఇళ్లు

ఆనందపురం: విశాఖ నగరానికి అతి సమీపంలో ఉన్న ఆనందపురం మండలంలో ఇళ్ల స్థలాలకు విపరీతమైన గిరాకీ ఉంది. దీంతో దిగువ, మధ్య తరగతి కుటుంబాల వారు ఎక్కువ మొత్తం వెచ్చించి స్థలాలు కొనుక్కోలేని పరిస్థితి. అలాంటి వారిని లక్ష్యంగా చేసుకొని కొంతమంది ప్రభుత్వ భూములు, వాగు పోరంబోకు స్థలాలు ఆక్రమించి చదును చేసి లే అవుట్లుగా మార్చి ఆ స్థలాలను లక్షలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విశాఖ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గంభీరం పంచాయతీ కల్లివానిపాలేనికి సమీపంలో ఉన్న గెడ్డలను కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. గంభీరం సర్వే నంబరు 177లో 3.13 ఎకరాల్లో గెడ్డ వాగు ఉంది. ఆర్టీవో కార్యాలయం వద్ద గల కొండల నుంచి వచ్చే వరద నీరు, భీమిలి క్రాస్ రోడ్డు, కొత్తకల్లివానిపాలెం ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఈ గెడ్డ గుండా ప్రవహించి గంభీరం రిజర్వాయర్ గెడ్డలో కలుస్తాయి. కాగా గెడ్డకు ఇరువైపులా నివాస గృహాలు ఏర్పడడంతో గెడ్డ మధ్యలో ఉండిపోయింది. దీంతో గెడ్డకు ఇరువైపులా గల ప్రాంతాన్ని యంత్రాలతో చదును చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఈ గెడ్డలో సుమారు ఎకరా వరకూ గతంలో కొంతమంది ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. ఇదిలా ఉండగా గత 10 రోజుల నుంచి సుమారు ఎకరా విస్తీర్ణం గల ప్రాంతాన్ని విశాఖకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి యంత్రాలతో చదును చేసి ప్లాట్లుగా విభజించి విక్రయాలు మొదలుపెట్టారు. వంద గజాలు ఉన్న స్థలాన్ని ఏడు లక్షల రూపాయల వరకూ విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సుమారు మూడు ఎకరాలు ఉండాల్సిన ఈ గెడ్డ వాగు ప్రాంతం ఆక్రమణల వల్ల కుదించుకుపోయి పిల్ల కాలువ మాదిరిగా తయారైంది. ఈ గెడ్డ వాగు ఆక్రమణలపై గతంలో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే పిల్ల కాలువ కూడా మిగిలేటట్టు లేదని అంటున్నారు. గెడ్డ ప్రాంతంపై పూర్తిగా నిర్మాణాలు జరిగితే నీరు ప్రవహించే మార్గంలేక వరద నీరు నిసావ ప్రాంతాల్లోకి చొచ్చుకు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల పాలైన స్థలం విలువ సుమారు రూ.3 కోట్లు ఉండొచ్చని అంటున్నారు.

గెడ్డలో నిర్మాణాలకు ఓటీఎస్ కోసం దరఖాస్తులు

గతంలో గెడ్డ స్థలం ఆక్రమించి నిర్మించిన ఇళ్లకు ఒన్‌టైం సెటిల్‌మెంట్ పట్టా మంజూరు చేయాలని 15 మంది అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. గెడ్డ వాగులో నిర్మాణాలకు అనుమతి లేదని, ఆ దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అయినప్పటికీ మరలా వాటి కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. అలాంటి వారిపై చర్యలు తీసుకోకపోవడం వల్లే మరలా కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని అంటున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం

గంభీరంలో గెడ్డవాగులో నిర్మాణాల విషయమై ఫిర్యాదు అందింది. పరిశీలన చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం. గెడ్డ, వాగు ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతి లేదు. పూర్తి స్థాయి విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

–లోకవరపు రామారావు, తహసీల్దార్, ఆనందపురం

ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించండి



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సచివాలయ, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, రెవెన్యూ అధికారులకు సూచించారు. భీమిలి మండలం తాటితూరు పంచాయతీ కన్నయ్య మఠం, ఉండబట్ల వారి కళ్లాలు తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, లో ఓల్టేజీ తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కళ్లాలకు చెందిన నక్కా పైడిరాజు మాట్లాడుతూ 2016లో తన 67 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్‌లో పేరు మార్చి కబ్జా చేశారని వాపోయాడు. ఇప్పుడు సగం భూమి ఇస్తే ఆన్‌లైన్‌లో తన పేరు మారుస్తామని అంటున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి పైడిరాజుకు జరిగిన అన్యాయాన్ని సవరించాలని ఆదేశించారు. అలాగే ఆనందపురం మండలం మచ్చవానిపాలెంలో జగనన్న లే అవుట్‌లో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, అక్కడకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. తాటితూరు పంచాయతీ కనకలపేటలో ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, అక్కడే తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ టి.నగరపాలెం, తాటితూరు, మజ్జివలస, లక్ష్మీపురం ప్రజలకు మచ్చవానిపాలెంలో ఇళ్ల కేటాయింపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, సర్పంచ్ శిరిగుడి సంతోషి, శిరుగుడి ఈశ్వరరావు, దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, దంతులూరి వాసురాజు, గాడు వెంకటప్పడు, బోని బంగారునాయుడు, మద్దిల వెంకటరమణ, పొట్నూరు చంద్రశేఖర్, పల్లంటి శ్యామ్ సుందరరావు, నీలాపు సూర్యనారాయణ, బండారు కనకారావు, మేడ చిన్నారావు, గుర్రపు వెంకట రమణ, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాస పోలమాంబ అమ్మవారి పండగ పోస్టర్ల ఆవిష్కరణ



అమ్మవారి ఆలయం వద్ద పండగ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత శ్రీరాస పోలమాంబ అమ్మవారి ఉత్సవాల పోస్టర్లను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆలయం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 1న అమ్మవారి ఉత్సవ చాటింపు జరగ్గా ఇప్పటి వరకు మరిడమ్మ, బంగారమ్మ, ముత్యాలమ్మ అనుపు ఉత్సవాలు ముగిశాయి. ఈ నెల 20న రాజ్యలక్ష్మి అమ్మవారికి అనుపు నిర్వహిస్తున్నారు. అలాగే 30న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహిస్తారు. తిరిగి మే నెల 1న శ్రీరాస పోలమాంబ అమ్మవారికి తొలేళ్లు, 2న అనుపు ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 30 నుంచి మే 2 వరకు సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రా కవ్వాలి, డాన్స్ బేబీ డాన్స్, బాణసంచా, కోలాటం, పులివేషాలు నిర్వహించనున్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పెద్దలు దాట్ల పెదబాబు, బోని బంగారునాయుడు, తుపాకుల అప్పలరాజు, తుపాకుల అప్పలస్వామి, నీలాపు సూర్యనారాయణ, బోనిల శివ, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, కరుభుక్త జోగినాయుడు, కనకల వెంకటరమణ, కరుభుక్త జోగినాయుడు, కొయ్య రామకృష్ణ, తుపాకుల సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: భీమిలి ఆదర్శప్రేమీ మండలి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా హిందీ పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు ఇటీవల అందించిన రూ.10వేల సాయంతో ఈ పుస్తకాలు పంపిణీ చేసినట్లు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో భీమిలి డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సుజాత కుమారి, ఉపాధ్యాయులు అల్లాడ శ్రీనివాసరావు, ఐ.వెంకటరావు, ఎం.రామకృష్ణ, నయీమ్, కేటీవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పీఎం పాలెం: వైఎస్సార్ క్రికెట్ స్టేడియం విద్యుత్ సబ్ స్టేషన్‌లో గల 11 కేవీ ధర్మపురి ఫీడర్ ఏరియాలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సుదర్శన్‌నగర్, చాణక్యపురి లే అవుట్, పీర్ లేస్ కాలనీ, సూర్యశక్తినగర్, బింద్రానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

పాఠశాలల పరిశీలన



మాట్లాడుతున్న కమిషనర్ ఇంజినీర్

కొమ్మాది: సొసైటీ ఆఫ్ స్వచ్ఛత యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరంలో గల ప్రభుత్వ చిల్డ్రన్ హోమ్, సాగర్ నగర్‌లో గల ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలను విజయవాడ కస్టమ్స్ కమిషనర్ (ప్రివెంటివ్) కె.ఇంజినీర్ బుధవారం పరిశీలించారు. భవిష్యత్తులో స్వచ్ఛత కార్యాచరణ, ప్రణాళికతో పాఠశాలలకు ఏ విధంగా సహాయం అందించాలో చర్చించారు. అనంతరం చిల్డ్రన్ హోమ్‌కు 2 ఇన్వెర్టర్లు, ప్రింటర్ కమ్ స్కానర్, గ్యాస్ స్టౌ, స్టీల్ డ్రమ్స్, కుర్చీలు, సాగర్‌నగర్ అంధుల పాఠశాలకు రెండు ఇన్వెర్టర్లు, ఐరన్ అల్మరాస్, ఆఫీస్ టేబుల్, 50 మొక్కలు అందజేశారు.

వస్తువుల ధరలు తగ్గించాలి

పద్మనాభం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం కార్యకర్తలు బుధవారం పద్మనాభం జంక్షన్‌లో పాదయాత్ర చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని, గ్యాస్, పెట్రోలు ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రవ్వ నరిసింగరావు తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడల సంరక్షణతో ప్రయోజనం



శిబిరంలో లేగ దూడలు ప్రదర్శిస్తున్న రైతులు

పద్మనాభం: రైతులు లేగ దూడలను సంరక్షించుకొని, మేలు జాతి పాడి పశువులుగా అభివృద్ధి చేయాలని విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన లేగ దూడల ప్రదర్శన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ పెయ్యిలు పుట్టుటకు అవకాశమున్న వీర్యము సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. దీని ద్వారా గేదెల్లో ముర్రా జాతి ఆడ పెయ్యిలు, ఆవుల్లో గిర్, సాహివాల్, సింధ్, జెర్సీ, హెచ్‌ఎఫ్ క్రాస్ ఆడ దూడలు పుడతాయని తెలిపారు. లేగ దూడలకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిశ్రమ దాణా తయారీ, వ్యాధుల నివారణపై తెలియజేశారు. ఈ సందర్భంగా మేలు రకం లేగ దూడలు కలిగిన రైతులను ఎంపికి చేసి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డి.రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, కర్రి శ్రీను, పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు రామ్‌మోహన్‌రావు, కరుణాకరరావు, సహాయ సంచాలకులు ఎం.ప్రసాదరావు, వెంకట రమణ, పశువైద్యాధికారులు ఆర్.అనుపమ, మహేష్, దినేష్ పాల్గొన్నారు.

"మా నమ్మకం నువ్వే జగన్"తో ప్రజల్లో విశ్వాసం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బాలాజీనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జగుపల్లి ప్రసాద్, తదితరులు



తాటితూరు నక్కా వారి కళ్లాల్లో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సంతపేటలో సర్వేలో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ తదితరులు



మరడపాలెంలో సర్వేలో సర్పంచ్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గంగ శ్రీను



నమ్మివానిపేటలో సర్వేలో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు

తగరపువలస: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం తాటితూరు పంచాయతీ నక్కా వారి కళ్లాల్లో బుధవారం సాయంత్రం నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆయన స్థానికులతో మాట్లాడారు. సాంకేతిక, ఇతర లోపాల కారణంగా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడటమే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యానారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు దుంపల నాగమణి, జీవీ నారాయణ, సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య రమేష్‌రెడ్డి, దుంపల ప్రభాకర్, రవ్వ ఈశ్వరరావు, ఉండబట్ల చిన్నారావు, ఉండబట్ల వెంకట అప్పారావు, మద్దిల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో 1, 2 వార్డుల సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్ తదితరులు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌కు ప్రజల మద్దతు కోరారు. సంతపేట సచివాలయం పరిధిలో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. నమ్మివానిపేట సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు, శిల్లా వంశీరెడ్డి, నమ్మి మాధవ, కంచుబోయిన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండలం రేఖవానిపాలెంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

మధురవాడ: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత బాగా అందాలన్నా.. ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధించాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని పాత పీఎంపాలెం 56వ నంబరు సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సర్వే చేపట్టారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకం అందుతోందని, ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటికే వస్తున్నాయంటూ పలువురు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోతిన శారద, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'మా నమ్మకం నువ్వే జగన్'

ఆనందపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం జోరుగా సాగుతోంది. నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరించి జగన్ మోహన్‌రెడ్డి పాలనపై ప్రజాభిప్రాయం తీసుకుంటున్నారు. ఏ గడపకు వెళ్లినా మరలా జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారు. ఎంతో ఉత్సాహంగా 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి జగన్ మోహన్ రెడ్డికి మద్దతు తెలుపుతున్నారు. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు చందక అప్పలస్వామి, డీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం యాతపేటలో నాయకులు బొట్టా రామకృష్ణ, రాములప్పడు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



పాత పీఎంపాలెంలో ఓ ఇంటి వద్ద స్టిక్కర్ అంటిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు



పొడుగుపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు



కల్లివానిపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో సచివాలయ సిబ్బంది బడి బాట కార్యక్రమంపై తల్లులకు బుధవారం అవగాహన కలిగించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు – నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారని కొండపేట సచివాలయ అడ్మిన్ జగదీష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ పెరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఆర్.అప్పలరాజు, ఎస్.రమేష్, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

సాంకేతిక లోపాన్ని సరిచేస్తాం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలసకు చెందిన కోల వెంకట విజయలక్ష్మి ఇంటికి సాంకేతిక లోపం కారణంగా మూడు రెట్లు అధికంగా బిల్లు వచ్చిందని చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ బొట్టా రవి తెలిపారు. 'జీరో యూనిట్ల విద్యుత్ వినియోగానికి రూ.1581 బిల్లు' శీర్షికతో ఈ నెల 18న సాక్షిలో ప్రచురించిన వార్తకు విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం స్పందించారు. విద్యుత్ వాడకం లేనప్పుడు జీరో యూనిట్లు రీడింగ్ వచ్చే కనెక్షన్లకు మూడు మాసాల సరాసరి బిల్లు పంపిస్తామన్నారు. సాంకేతిక లోపం కారణంగా సరాసరి బిల్లుకు మూడురెట్లు వినియోగదారునికి వచ్చిందన్నారు. బిల్లు సవరించడానికి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆనందపురం: మండలంలోని వేములవలసకు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మధురవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విశాఖ నుంచి తగరపువలస వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేగంగా వెళ్లాలన్న ఉద్దేశంతో హారన్ మోగించగా బస్సు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకుడు కెల్ల రమణ కంగారుపడడంతో వాహనం అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో రమణ బస్సు కిందకు దొర్లుకుంటూ వెళ్లిపోయాడు. అప్పటికే పరిస్థితిని గమనించిన డ్రైవర్ బస్సుని నిలిపివేయడంతో ప్రాణాపాయం తప్పింది. తీవ్రంగా గాయపడిన రమణను చికిత్స కోసం తరలించిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. క్షతగాత్రుడు కెల్ల రమణ(40) ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం నివాసి.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి బుధవారం పర్యటించారు. ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపించాలని, డ్రైనేజీలు, డస్ట్‌బిన్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పాలిథిన్ కవర్ల నిషేధం పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట కార్పొరేటర్ లొడగల అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు ఉన్నారు.